BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 06 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

# టెట్ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యా విభాగం ఉన్నత అధికారులు సంయుక్తంగా బుధవారం విడుదల చేశారు. టెట్ పరీక్ష రాసేందుకు 2లక్షల 75వేల 753 మంది దరఖాస్తు చేసుకోగా జనవరి 2 నుంచి 20వ తేదీ వరకు జరిగిన పరీక్షలకు లక్షా 35వేల 802 మంది మాత్రమే హాజరైనట్టు పాఠశాల విద్యా శాఖ పేర్కొంది. వీరిలో 42వేల 384 మంది అభ్యర్థులు అంటే కేవలం 31.21 శాతం మంది మాత్రమే అర్హత సాధించారని ప్రకటించింది. ఫలితాలను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్ సైట్ https://tgtet2024.aptonline.in/tgtet/లో చెక్ చేసుకోవాలని అధికారులు తెలిపారు. మొత్తం రెండు పేపర్లుగా టెట్ పరీక్షలను నిర్వహించారు. అందులో పేపర్ 1 మొత్తం 8 సెషన్లలో తెలుగు , హిందీ, ఉర్దు, కన్నడ, మరాఠీ , తమిళ్, బెంగాలీ భాషల్లో నిర్వహించారు. ఇక పేపర్ 12సెషన్లుగా 7భాషల్లో రాసేందుకు అవకాశం కల్పించారు. పరీక్ష పూర్తైన రెండు వారాల్లోనే పాఠశాల విద్యాశాఖ ఫలితాలను ప్రకటించింది.

# ఢిల్లీలో పోలింగ్ ప్రశాంతం

**ఢిల్లీలో 57.89 శాతం పోలింగ్  ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**





**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకూ 57.89 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 63.83 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సౌత్ ఈస్ట్ ఢిల్లీలో 53.77 శాతం నమోదైంది. ఈస్ట్ ఢిల్లీలో 58.98 శాతం, న్యూఢిల్లీలో 54.37, షాదారాలో 61.35, సౌత్ ఢిల్లీలో 55.72, నార్త్ ఢిల్లీలో 57.24, వెస్ట్ ఢిల్లీలో 57.42, సెంట్రల్ ఢిల్లీలో 55.24, సౌత్ వెస్ట్ ఢిల్లీలో 58.86, నార్త్ వెస్ట్‌లో 58.05 శాతం పోలింగ్ నమోదైంది. సీలాంపూర్, జాంగ్‌పుర, కస్తూర్బా నగర్‌లో నకిలీ ఓట్లు పోలవుతున్నాయని బిజెపి నేతలు ఆరోపించడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని అధికారులు ప్రకటించారు. సీలంపూర్‌లో ఓటింగ్ జరగలేదని పోలీసులు ఖండించారు. కస్తూర్బా నగర్‌లో ఇద్దరు మోసపూరితంగా ఓటు వేయడానికి ప్రయత్నించారని, వారిని పట్టుకుని విచారిస్తున్నారని తెలిపారు. సీలంపూర్‌లో బిజెపి నకిలీ ఓటింగ్ ఆరోపణల తరువాత, పార్టీకి చెందిన మరికొంతమంది నాయకులు పోలింగ్ బూత్ వెలుపల నినాదాలు చేయడం ప్రారంభించారు. ఢిల్లీ పోలీసులు ఆ ప్రాంతంలో మోహరించిన భద్రతను సూచిస్తూ ఆరోపణలను తోసిపుచ్చారు. అదనపు పోలీసులు, పారామిలిటరీ దళాలను కూడా మోహరించారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, కేంద్ర మంత్రులు ఎస్ జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తదితర ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# సర్వేపై త్వరలో పవర్ పాయింట్ ప్రజంటేషన్

- కులగణనతో దశాబ్దాల సమస్యకు పరిష్కారం
- కులగణన సర్వేతో దేశం తెలంగాణ వైపు చూస్తోంది
- త్వరలో డిటైల్డ్ సర్వే రిపోర్టు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**బలగం టీవీ, హైదరాబాద్**

కులగణనతో దశాబ్దాల సమస్యకు పరిష్కారం చూపామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. పగడ్బందీగా సర్వే చేశామన్నారు. లక్ష మంది సిబ్బందితో సర్వే చేశామని.. ఈ కులగణన తెలంగాణ ఎక్స్ రే అని అన్నారు. సర్వే ఎలా జరిగిందో త్వరలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తామన్నారు భట్టి. సర్వే జరిగిన తీరు ప్రజలకు తెలియాలన్నారు. బుధవారం డిప్యూటీ సీఎం విలేకరులతో మాట్లాడారు. కులగణన చేస్తామని రాహుల్ మాటిచ్చారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడగానే ఈనిర్ణయం తీసుకున్నాం. కులగణన సర్వే హడావిడిగా చేసింది కాదు. సుధీర్ఘ కసరత్తు తర్వాత సర్వే చేశాం. నాలుగు జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టాం. బ్లాకులుగా ఏర్పాటు చేసుకుని సర్వే చేపట్టాం. ఎక్కడా పొరపాటు లేకుండా జాగ్రత్త పడ్డాం. ఎన్యుమరేటర్లకు ట్రైనింగ్ కూడా ఇచ్చాం. లక్ష మంది సిబ్బంది ఈ సర్వేలో భాగమయ్యారు. సర్వే జరగొద్దని చాలా కుట్రలు చేశారు.ఎన్నికుట్రలు చేసినా సర్వే ఆగలేదు. సహకరించిన ప్రతి కుటుంబానికి ధన్యవాదాలు. ఈ సర్వే జరిగిన తీరుపై త్వరలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తాం. సర్వే ఎలా జరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలియాలి. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యలకు పరిష్కారం చూపాం.దేశ వ్యాప్తంగా కులగణన చేయాలి అని అన్నారు.

# సర్వే ఆధారంగా సంక్షేమం పథకాలు



**బలగం టీవీ, హైదరాబాద్**

కుల గణన సర్వే నివేదిక లెక్కల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం పథకాల రూపకల్పన చేస్తుందని కులగణన కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ కమిటీ హాలులో బీసీ కులగణనపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన సర్వేపై కొందరు అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కుల గణన సర్వే ఎలా జరిగింది అనేది ప్లానింగ్ డిపార్ట్ మెంట్ వివరిస్తుందన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ఇంత శాస్త్రీయంగా, లాజికల్ గా దేశంలోని ఏ రాష్ట్రంలో కుల గణన జరగలేదన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండవద్దని ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు వివరణ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అన్ని కులాలకు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే జరిగిందన్నారు. సర్వే పై ప్రజలెవరికీ అపోహలు అవసరం లేదన్నారు. చాలా మంది సమగ్ర కుటుంబ సర్వే తో పోల్చుకున్నారన్నారు. అది పబ్లిక్ డొమైన్ లో లేని డాక్యుమెంట్ అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ కూడా 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకొని చేసిందేనన్నారు. వ్యక్తిగత వివరాలు కాకుండా.. రేపు ఎల్లుండి లోగా పబ్లిక్ డొమైన్ లో కులాల వారిగా, ఉప కులాల వివరాలను జిల్లాల వారీగా పెడతామన్నారు. సర్వేపై అపోహలు, అనుమానాలు ఉన్న కుల సంఘాల నేతలను పిలిచి.. చర్చించి నివృత్తి చేస్తామన్నారు. కుల గణన సర్వే నివేదిక ఆధారంగా సంక్షేమ పథకాల రూపకల్పన చేస్తామన్నారు.

కులగణన సర్వేకు సంబంధించి వ్యక్తిగత వివరాలు మినహాయించి రేపు, ఎల్లుండిలోగా పబ్లిక్ డొమైన్ లో కులాల వారిగా, ఉప కులాల వివరాలను జిల్లాల వారిగా పెడతామని ఉత్తమ్ వెల్లడించారు. సర్వేపై అపోహలు, అనుమానాలు ఉన్న కుల సంఘాల నేతలను పిలిచి వారితో చర్చించి అపోహాలను నివృత్తి చేస్తామన్నారు. కుల గణన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, సబ్ కమిటీ కో చైర్మన్ దామోదర్ రాజా నరసింహ, సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క సహా ఇతర మంత్రులు హాజరయ్యారు.

# స్కూల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రిన్సిపాల్ తిట్టడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని శాస్త్ర స్కూల్‌లో బుధవారం జరిగింది. విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని మల్లికార్జున కాలానికి చెందిన నీరజ్ శాస్త్ర గ్లోబల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో నీరజ్, మరో విద్యార్థి పాఠశాల బాల్కనీలో మాట్లాడుకుంటుండగా ప్రిన్సిపాల్ నరేందర్‌రాయ్ ఆఫీసులోకి పిలిచి మందలిచ్చారు. దాంతో మనస్తాపానికి గురైన నీరజ్ టాయిలెట్‌కు వెళ్తున్నట్టు చెప్పి.. అక్కడే భవనంపైకి ఎక్కి మొదటి అంతస్తు నుంచి దూకాడు. పాఠశాల సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్య విషయమై విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టాయి.

# ఎల్బీనగర్‌లో గోడ కూలి ముగ్గురు మృతి

- మరొకరికి గాయాలు...

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. సెల్లార్ తవ్వకాల్లో అపశృతి చోటు చేసుకుంది. సెల్లార్ లోపల పనిచేస్తుండగాపైనుంచి మట్టిదిబ్బలు కూలిపోయాయి. ఈ ఘటనలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. మరో కూలీ తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్‌బీనగర్ పోలీసులు, తోటి కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కుంజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల వీరయ్య(50)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకు దెరువు కోసం 5 సంవత్సరాల క్రితం అతను నగరానికి వలస వచ్చి పెద్ద అంబర్ పేటలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం వీరయ్య తన చిన్న కొడుకు రాము(21), తన మేనల్లుడు ముద్దం వాసు(21)లను తీసుకుని ఓ బిల్డర్ ద్వారా ఫోన్‌లో సమాచారం తెలుసుకుని ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో చంద్ర పురి కాలనీలో పనికి వెళ్లారు. సుమారు 1000 చదరపు గజాల స్థలంలో జరుగుతున్న సెల్లార్ నిర్మాణ పనుల్లో కింది భాగంలో పీసీసీ కాంక్రీటు పనుల్లో వారు ముగ్గురు నిమగ్నమయ్యారు. అయితే ఒక్కసారిగా 60 ఫీట్ల ఎత్తు నుంచి ప్రహరీ కూలిపోవడంతో మట్టి పెళ్లలు, రాళ్లువారి మీద పడడంతో వారు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, డీఆర్ఎఫ్ టీమ్ అక్కడకు చేరుకుని మతులను పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వారితో పాటు పనిచేస్తూ గాయాల పాలైన నల్గొండ జిల్లా, చింతపల్లికి చెందిన భిక్షపతిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకుని వెల్లడించారు. మొత్తం 1000 చదరపు గజాల స్థలంలో రెండు సెల్లార్‌లు,ఒకే గ్రౌండ్ ఫ్లోర్ తో పాటుగా మరో 4 అంతస్తుల నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి రమేష్ అనే వ్యక్తికి గత ఏడాది డిసెంబర్‌లో అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే నిర్మాణం జరుగుతున్న సమయంలో కూలీలకు రక్షణ పరికరాలు లేకపోవడంతో వారు అక్కడికక్కడే మతిచెందినట్టు తెలుస్తోందన్నారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ నర్సింహారెడ్డి ఉన్నారు.

# అప్పటి వరకు హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దు : హైకోర్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఈ నెల 12వ తేదీ వరకు హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దని హైకోర్టు పేర్కొంది. హరీశ్‌రావును అరెస్ట్ చేయవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు బుధవారం మరోసారి పొడిగించింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేయాలంటూ హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. హరీశ్ రావును అరెస్ట్ చేయవద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది.

# రైతు భరోసా నిధులు విడుదల

- 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణలో రైతు భరోసా పథకం కింద లక్షలాది మంది రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. ప్రధానంగా ఒక ఎకరం వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ సాయం అందించారు. ఈ సందర్భం గా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. రైతు భరోసా పథకం ప్రారంభం నుండి ఇప్పటివరకు మొత్తం రూ.1,126.54 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వివరించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటోందని, నిర్ణీత గడువులోగా నిధులు విడుదల చేస్తున్నామని, రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే చాలామంది రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కాగాఎకరం భూమి ఉన్నా రైతుభరోసా పడలేదని కొందరు వాపోతున్నారు. నేడు లేదా రేపువారి అకౌంట్లోనూ భరోసా డబ్బులు డిపాజిట్ చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఏం చేద్దాం..?

- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ..!
- అసెంబ్లీ సెక్రటరీ, సుప్రీంకోర్టుకు ఇవ్వాల్సిన సమాధానంపై చర్చ



**బలగం టీవీ, హైదరాబాద్**

పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు, అసెంబ్లీ కార్యదర్శి ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంటిలో భేటి అయినట్టు సమాచారం. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నట్టు వార్తలు వస్తున్నాయి. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో న్యాయపరంగా ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై వారు ఈ భేటీలో ప్రధానంగా చర్చించారని తెలిసింది.. అదేవిధంగా తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీ, సుప్రీంకోర్టుకు ఇచ్చే సమాధానంపై కూడా చర్చ జరిగింది. ఇక ఎమ్మెల్యేలు అంతా వెంటనే ఢిల్లీకి వెళ్లి అక్కడ సమాలోచనలు చేయాలని యోచిస్తున్నట్టు తెలిసింది. న్యాయపరంగా సుప్రీంకోర్టులో అందరూ కలసి పిటిషన్ వేయాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సమావేశంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే దానం నాగేందర్ తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, గూడెం మహిపాల్ రెడ్డి, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, డాక్టర్ సంజయ్ కుమార్, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నట్టు విశ్వసనీయ సమాచారం.

కాగా, బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లిన ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి ఈనెల 4న నోటీసులు జారీ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేసిన అసెంబ్లీ సెక్రటరీ.. పార్టీ మార్పు వ్యవహారంపై లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని కోరారు. స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు అందుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని కోరారు.



# నేడు సీఎం రేవంత్ అధ్యక్షతన సీఎల్పీ సమావేశం !

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) గురువారం సమావేశం కానుంది. ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కేంద్రంలోసీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలతో రేవంత్ కీలక చర్చలు జరపనున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి ప్రధాన అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. పల్లె, పట్టణ స్థాయిలో కాంగ్రెస్ బలపడేందుకు తీసుకోవాల్సిన చర్యలను రేవంత్ వెల్లడించనున్నారు. పార్టీ గెలుపుకు అవసరమైన చర్యలను అమలు చేయడం కోసం ఎమ్మెల్యేలకు ప్రత్యేక సూచనలు అందించనున్నారు. ఇక రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ నిర్ణయాలు, పాలనా వ్యూహాలపై ఈ భేటీలో చర్చించే అవకాశం ఉంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరూ హాజరుకానున్నారు. సమావేశం అనంతరం సీఎల్పీ నేతలు మీడియా ద్వారా కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది.

# గాజాను స్వాధీనం చేసుకుంటా

- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్
- సరైన ఆలోచనే అన్న నెతన్యాహు
- ఉలిక్కిపడిన మధ్య ప్రాచ్యం
- ఖండించిన హమాస్

వివరాలు 2వ పేజీలో

# రాహుల్ గాంధీ పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకోవాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఏడాదిగా విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి దేనిపైనా స్పష్టతలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్దాలను ప్రచారం చేసిందన్నారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, గ్యారంటీలు, డిక్లరేషన్లన్నీ బూటకమని తేలిపోయాయని చెప్పారు. ఆయన తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిదని ఎక్స్ వేదికగా విమర్శించారు.‘నిన్నటి అసెంబ్లీ సమావేశం.. తెలంగాణ ప్రజలకు రెండు విషయాలు స్పష్టం చేసింది. ఏడాది కాలంగా పూర్తిగా విఫలమవుతున్న ప్రభుత్వానికి దేనిపై కూడా స్పష్టత లేదు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా అబద్ధాలను ప్రచారం చేసింది. అసెంబ్లీలో సమర్పించిన డేటాపై రాష్ట్ర సర్కారుకు ఏమాత్రం క్లారిటీ లేదు.

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఎంతమాత్రం లేదని నిన్నటితో తేలిపోయింది. రిజర్వేషన్ల అంశంపై నిస్సిగ్గుగా కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. కేంద్రంపైకి నెపం నెట్టి తప్పించుకోవాలని పన్నాగం వేసింది. రాహుల్ గాంధీ ఇచ్చిన ఎన్నికల హామీలు, చెప్పిన గ్యారంటీలు, చేసిన డిక్లరేషన్నీ బూటకమని తేలిపోయింది. అబద్ధాలు ప్రచారం చేసి ఎన్నికల్లో లబ్ధిపొందడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న రాహుల్ గాంధీ తన పేరును ఎలక్షన్ గాంధీగా మార్చుకుంటే మంచిది. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధం. ఈ సర్కారు నిబద్ధత వంద శాతం నకిలీ’ అంటూ ట్వీట్ చేశారు.

# గాజాను స్వాధీనం చేసుకుంటా

## అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

బలగం టీవీ, హైదరాబాద్



ఇజ్రాయిల్ దాడులతో చిన్నాభిన్నమైన గాజా ప్రాంతాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని, అక్కడ అపరిమితమైన సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తామని, కొత్తగా ఇళ్ళను నిర్మిస్తామని వెల్లడించారు. కాగా ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. వైట్‌హౌస్‌లో మంగళవారం ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహుతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్, గాజాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. గాజా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మాత్రమే ట్రంప్ చెప్పారు. అక్కడ నివసించడానికి ఎవరిని అనుమతిస్తారనే విషయాలు వెల్లడించలేదు. ప్రస్తుతం గాజాలో నివసిస్తున్న పాలస్తీనియన్లందరూ అక్కడ నుండి వెళ్ళిపోవాలని, మధ్య ప్రాచ్యంలోని ఇతర దేశాల్లో నివసించాలని అన్నారు. గాజాను తమ అధీనంలోకి తీసుకుని, దాడుల కారణంగా ధ్వంసమైన భవనాలన్నింటినీ కూల్చివేసి, పేలని బాంబులను నిర్వీర్యం చేసి, ఇతర ఆయుధాలను అక్కడ నుంచి తొలగించి, ఆ ప్రాంతాన్నంతా శుభ్రపరుస్తామని చెప్పారు. ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తామన్నారు. అక్కడ నివసించేవారికి ఇండ్లు కూడా నిర్మిస్తామన్నారు. వారికి వేరే ప్రత్యామ్నాయం లేకనే పాలస్తీనియన్లు గాజాకు తిరిగి వెళ్లానుకుంటున్నారని అన్నారు. ప్రమాదకరంగా వున్న భవనాల్లో నివసిస్తూ, అనుక్షణమూ భయం, భయంగా బతుకు వెళ్లదీసే బదులు భద్రత వున్న ఇళ్ళల్లో, మంచి వాతావరణంలో వారు జీవించవచ్చని సూచించారు. గాజాకు అమెరికా బలగాలను పంపే అవకాశం వుందా అని ప్రశ్నించగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గాజాను స్వాధీనం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నామని, భవిష్యత్‌లో మధ్యప్రాచ్యంలో పర్యటన సందర్భంగా గాజా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలను సందర్శిస్తానని ట్రంప్ చెప్పారు. గాజా స్ట్రిప్‌ను మృత్యువు, విధ్వంసాలకు చిహ్నంగా ట్రంప్ అభివర్ణించారు. నరకానికి ప్రవేశద్వారంలా వుందన్నారు. అక్కడ నివసించడం ఏ మాత్రమూ సరికాదన్నారు.

# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కావాలి



## 7న తలపెట్టిన వేల గొంతులు లక్షల డప్పుల సాంస్కృతిక మహాప్రదర్శన వాయిదా

## ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆరోపించారు. మాదిగలకు 9 కాదు 11 శాతం రిజర్వేషన్లు దక్కాలన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. చాలా కమిషన్లు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని గుర్తు చేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలుచేస్తున్నట్టు ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదులు చెబుతున్నట్టు తెలిపారు. అయితే వర్గీకరణ అశాస్త్రీయంగా ఉందన్నారు. వర్గీకరణ ద్వారా మాదిగలకు రావాల్సిన వాటా కంటే 2 శాతం తక్కువ రిజర్వేషన్లు వచ్చాయని అన్నారు. 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని.. మరి 32 లక్షలు ఉన్న మాదిగలకు ఏ ప్రాతిపదికన తీసుకున్నా 11 శాతం రావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్దుబాటు చేసుకోవాలనడం సరికా దని.. నిర్ణయాన్ని పున్ణ పరిశీలించి మాదిగలకు న్యాయం చేయాలని కోరారు.

జాతి కోసం కృషి చేయని మంత్రి దామోదర రాజనర్సింహ తమకెందుకని మందకృష్ణ నిలదీశారు. వారి జాతి కోసం రిజర్వేషన్లు చేజారకుండా కషి చేయడంలో ఎమ్మెల్యే వివేక్ సఫలమయ్యారని, తమ జాతి కోసం రిజర్వేషన్లు వాటాను కల్పించడంలో దామోదర రాజనర్సింహ విఫలమయ్యారని చెప్పారు. ఆయనను తాము మంత్రిగా చూడటం లేదన్నారు. దామోదర ఎందుకు మౌనంగా ఉన్నాడో చెపాలని డిమాండ్ చేశారు. ఆయన మౌనం, చేతగానితనం మాదిగలు ఎప్పటికీ క్షమించరని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మాదిగ వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఇక ఫిబ్రవరి 7న తలపెట్టిన వేల గొంతులు లక్షల డప్పుల సాంస్కృతిక మహాప్రదర్శనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే వాహనాలు బుక్ చేసుకున్న మాదిగ, ఉప కులాల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నూతన తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఆ కార్యక్రమం స్థానంలో 15 రోజుల తర్వాత సాంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నేత వెంకటేష్, పధ్వీ, నల్గొండ గద్దర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం : జాన్ వెస్లీ

బలగం టీవీ, హైదరాబాద్



స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామనీ, అయితే, వామపక్ష పార్టీలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. తెలంగాణలో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చి ధన, మద్య ప్రలోభాల రాజకీయాలను తిప్పికొడతామని నొక్కి చెప్పారు. కమ్యూనిస్టు పార్టీగా దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందాలని తాము కోరుకుంటుంటే మోడీ సర్కారు మాత్రం ఆ రెండు రంగాలను పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో మీట్ ది మీడియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్లీ మాట్లాడుతూ..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న ఫలితంగానే ఒక్కశాతం ఉన్న కార్పొరేట్ల చేతిలో 27 శాతం సంపద పోగైందని చెప్పారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయల సంపదను అప్పనంగా కట్టబెడుతున్న తీరును ఎండగట్టారు. దేశంలో 50 శాతం ఉన్న పేదల చేతుల్లో కేవలం 13 శాతం సంపదే ఉందని చెప్పారు. దీంతో వారు రక్తహీనత, పేదరికం, నిరుద్యోగం, నిత్యావసర సరుకులు ధరలు, విద్య, వైద్యం, ఇండ్లలేమి, నిరుద్యోగం వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గత

# పద్మవిభూషణ్ ఆగాఖాన్ మృతిపై సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మవిభూషణ్ గ్రహీత ఆగాఖాన్ మృతిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఇస్మాయిలీ ముస్లింల వారసుడిగా ఆధ్యాత్మిక గురువుగా నియమితులైన కరీం అల్-హుస్సేనీ ఆగాఖాన్ మరణం మానవాళికి తీరని లోటని ముఖ్యమంత్రి అన్నారు. గొప్ప సామాజిక వేత్త, మానవతావాదిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును అందుకున్నారని సిఎం పేర్కొన్నారు. ఆగాఖాన్ నెట్ వర్క్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్య, సాంస్కృతిక సంస్థలను నెలకొల్పి మానవాళికి తన సేవలను అందించా రని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. పేదరిక నిర్మూలన, వారసత్వ సంపద పరిరక్షణకు, వైద్య సేవలు, విద్యా రంగంలో ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివని, హైదరాబాద్ కేంద్రంగా ఆగాఖాన్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆయన జీవితాంతం మానవజాతి గౌరవం పెంచే ఉన్నత విలువలను ఆచరించారని ఆయన కొనియాడారు. వారి వారసులకు, కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ షోకాజ్ నోటీసు

బలగం టీవీ, హైదరాబాద్

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ బుధవారం ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. కుల గణన సర్వేను తప్పుబడుతూ అభ్యంతరకరమైన భాషతో విమర్శలు చేయడం, కుల గణన ఫారంను దగ్ధం చేయడంపై వివరణ ఇవ్వాలంటూ ఈ నోటీసుల్లో పేర్కొంది.




# కుల గణన శాస్త్రీయ పద్ధతిలో జరిగింది

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

బలగం టీవీ, హైదరాబాద్

కుల గణన శాస్త్రీయ పద్ధతిలోనే జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో 56 శాతానికి పైగా బీసీలు ఉన్నారని ఆయన తెలిపారు. బీసీ సంఘాలను బీఆర్ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీసీ సంఘాల నేతలు రాజకీయ నాయకుల ట్రాప్‌లో పడవద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఈర్లపల్లి శంకర్, పార్టీ నాయకులు చరణ్‌కౌశిక్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీలో ఎవరైనా సరే గీత దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. మా పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అయినా, ఎంపీ అయినా గీత దాటితే క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. క్రమశిక్షణ తప్పితే ఏం చేయాలో కమిటీ చూసుకుంటుందని ఆయన అన్నారు. రేపు కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉందని, అందులో అన్ని అంశాలు మాట్లాడుతామన్నారు. కుల గణన, ఎస్సీ వర్గీకరణతో బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం చొరవతో ఈ రెండు సాధ్యమయ్యాయన్నారు. స్వాతంత్రానంతరం బీసీ కుల గణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. బీహార్ వంటి రాష్ట్రాలు కుల గణన చేపట్టినా కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. కుల గణనపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడానికి బదులు సూచనలు, సలహాలు ఇస్తే బాగుంటుందన్నారు.

బీసీల జనాభాను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందా? మీ లెక్కేంది? అందుకు సంబంధించిన మీ వద్ద ఉన్న ఆధారమేంది? అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ప్రశ్నించారు. బీసీ, ఎస్సీల దశాబ్దాల కల సాకారమైందని చెప్పారు. అందువల్ల తప్పుడు ప్రచారం చేసి ప్రజలను గందగోళన పరచొద్దని విజ్ఞప్తి చేశారు. బీసీల జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం చేశారనడం సరైందికాదన్నారు. అన్ని అంశాలూ పరిగణనలోకి తీసుకుని పక్కాగా సర్వే చేసినట్టు చెప్పారు. 'ఏ లెక్కల ఆధారంగా కులగణన తప్పని అంటున్నారో ప్రతిపక్షాలు చెప్పాలి. మీరు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపండి. రాజకీయ నాయకుల ఉచ్చులో బీసీ సంఘాలు, నాయకులు పడవద్దు' అని విజ్ఞప్తి చేశారు. బీసీలను అణగదొక్కిన పార్టీలు, నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. బీసీ లెక్కలు తగ్గాయంటూ మాట్లాడుతున్న వారికి ప్రామాణికమేంటని ప్రశ్నించారు. తప్పుడు మాటలతో బీసీలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. గత పదేండ్లలో బీసీలకు ఏం న్యాయం చేశారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీల జనాభా తగ్గించింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆకాంక్ష నెరవేర్చ డంతో ప్రతిపక్షాలు కడుపుమంటతో అడ్డగోలుగా మాట్లాడుతున్నాయని విమర్శించారు. సమగ్ర కుటుంబ సర్వే మంచిదే అయితే దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణనపై ఎవరికైనా అనుమా నాలు ఉంటే అన్ని విషయాలూ మాట్లాడుకుంటామని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఎంత చిన్నవారైనా, పెద్దవారైనా పార్టీ క్రమశిక్షణకు లోబడే ఉండాలని సూచించారు. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా కులగణనకు ఇంకా వివరాలు ఇవ్వకపోతే ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు.

# చెల్లి లేరా... నాతో ఆడుకోరా..



- సోదరి కోసం అన్న రోదన
- నెలన్నర చిన్నారికి ప్రాథమిక ఆసుపత్రిలో టీకా వేసిన అనంతరం జ్వరంతో మృతి
- టీకా వికటించి చిన్నారి మృతి చెందిందని బంధువుల ఆరోపణ..
- ఆస్పత్రి ఆవరణలో ఆందోళన.
- తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో విషాదం.

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

చెల్లి లేరా.. నాతో ఆడుకోరా అని అన్న రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. 9 సంవత్సరాల తర్వాత ఆడబిడ్డ పుట్టడంతో ఆ ఇంట్లో ఆనందం నెలకొంది. నెలన్నర గడవకముందే ఆనందం ఆవిరై ఆ ఇంట్లో విషాదం నెలకొంది. నెలన్నర చిన్నారి మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నేరెళ్ల గ్రామానికి చెందిన దాసరి లలితా రమేష్ దంపతులకు కుమారుడు 9 ఏండ్ల హన్షిత్, 9 సంవత్సరాల తర్వాత రెండవ కాన్పులో కూతురు జన్మించారు.. బుధవారం నేరెళ్ల ప్రాథమిక ఆసుపత్రిలో చిన్నారి కి నెలన్నర టీకాలు వేయించగా, చిన్నారికి జ్వరం రాగా, జ్వరం సిరప్ వేసిన, జ్వరం తగ్గకపోవడంతో,వెంటనే చిన్నారిని సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాగా అప్పటికే చిన్నారి మృతి చెందిందని డాక్టర్ చెప్పాడని బంధువులు తెలిపారు. టీక వేయడం వలనే చిన్నారి మృతి చెందిందని చిన్నారి తల్లిదండ్రులు ఆరోపిస్తూ చిన్నారి మృతదేహంతో పిహెచ్సి ఎదుట ఆందోళనకు దిగారు. బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్



చేశారు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్వో రజిత హామీ ఇచ్చినా ఆందోళన విరమించలేదు. కలెక్టర్ వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకునేదాకా ఆందోళన విరమించేది లేదని బీస్మించుకొని కూర్చున్నారు.ఆస్పత్రి ఆవరణలో ఉదృత వాతావరణం ఏర్పడగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాదాబాయి, ఎమ్మార్వో జయంత్, డీఎస్పి చంద్రశేఖర్ రెడ్డి,సీఐ మొగులి సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు .చిన్నారి కుటుంబానికి తక్షణసాయంగా రూ.2 లక్షల రూపాయలు చెక్కును అందజేశారు.బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఎస్సై రామ్మోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



## ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా రంగు అంజయ్య..

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా రంగు అంజయ్య ఎన్నికయ్యారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ముదిరాజ్ సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా రంగు అంజయ్య, ఉపాధ్యక్షుడుగా రెడ్డి ఐలయ్య, ప్రధాన కార్యదర్శిగా రంగు రాములు, కోశాధికారిగా కోడి రాజలింగం, సహాయ కార్యదర్శిగా కొంగరి మల్లేశం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎడ్మమల హనుమంత రెడ్డి,తిరున హరి భానుమూర్తి వ్యవహరించారు. గెలుపొందిన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. నూతన పాలకవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ శాలవాలతో సన్మానించారు.

# పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వాహణ పై అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ, వివిధ అన్ని విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు, జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఫిబ్రవరి 10 నాడు అల్బెండజోల్ మాత్రలు అందచేయాలని అన్నారు .

జిల్లాలోని ఏ.ఎన్.ఎం.లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, వర్కర్ల ద్వారా ఫిబ్రవరి 10 రోజున ఇంటింటికి వెళ్లి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను వంద శాతం వేయాలని, ఒక వేళ ఈ రోజున మిస్ అయిన పిల్లలకు ఫిబ్రవరి 17 నాడు మాప్ ఆప్ డే నాడు తప్పక అందించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరి చొప్పున అంగన్వాడీ సూపర్వైజర్లు, సి.డి.పి.వో. లు, మెప్మా సిబ్బంది పర్యవేక్షణాధికారులుగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటకు సిబ్బంది అందరూ భాగస్వామ్యులు కావాలని, ఈ మాత్రల వలన సైడ్ ఎఫెక్టులు ఏమి ఉండవువని ప్రజల్లో,తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి రజిత



మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో అల్బెండజోల్ మాత్రలను 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి వేయాలని, గ్రామాల్లో పట్టణంలో ముందుగా చాటింపు చేయాలని సూచించారు. 1 నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలందరికి సగము మాత్రను పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలని అన్నారు. 2 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఒక మాత్ర చొప్పున వేసి పూర్తిగా నమలమని చెప్పాలని, మాత్రలను ఇచ్చే సమయంలో త్రాగు నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నకు సంబంధించిన పోస్టర్ లను ఆవిష్కరించినారు. ఈ సమావేశం లో డిడబ్ల్యూవో లక్ష్మి రాజం, డిపిఆర్ఓ,వి.శ్రీధర్, ,మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్ ,జిల్లా విద్యా శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , సిరిసిల్ల**




మహాత్మా జ్యోతి భాపులే విద్యాలయంలోని స్టోర్ రూమ్, కిచెన్ గది నిత్యం క్లీన్ గా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి వద్ద ఉన్న మహాత్మా జ్యోతి భాపులే విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, వసతి గదులు, స్టోర్ రూం, కిచెన్ పరిశీలించారు. ఆహార పదార్థాలు నిల్వ చేసే, అలాగే సిద్ధం చేసే గదులు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం 7 వ, 8వ తరగతి సిలబస్ ఎంతమేరకు పూర్తి అయింది ఆరా తీశారు. అన్ని తరగతుల సిలబస్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ అన్ని తరగతుల విద్యార్థులతో నిత్యం ఆయా పాఠ్యాంశాలు చదివించాలని, రాయించాలని పేర్కొన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ప్రణాళిక ప్రకారం సిద్ధం చేయాలనిఅన్నారు . మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ శ్రీనాథ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయింపు

**కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి**

**బలగం టీవీ , బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని 23 గ్రామాలకు సి.ఆర్.ఆర్ గ్రాంట్ (గ్రామీణ రోడ్డు నిర్మాణం)(ఎస్.సి సబ్ ప్లాన్) నిధుల నుండి ఒక కోటి అరవై లక్షలు గ్రామాలలో సీసీ రోడ్డు మరియు డ్రైనేజి ల నిర్మాణాల కోసం చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మండల అభివృద్ధి కోసం ప్రత్యేకించి నిధులు కేటాయించినందుకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, మండల ప్రజల తరుపున, మండల కాంగ్రెస్ నాయకుల తరుపున ఎమ్మెల్యేకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు.





## తీన్మార్ స్టెప్పులతో

## దుమ్ము లేపిన ఫోక్ ఇండస్ట్రీ యూట్యూబ్ కళాకారులు

**-వేములవాడ పట్టణంలో ఘనంగా ఐటీఎఫ్ రెండో వార్షికోత్సవ వేడుకలు**

**బలగం టీవీ , వేములవాడ**

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో యూట్యూబ్ తల్లి గూగులమ్మ బోనాలు రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో బుధవారం బద్ది పోచమ్మ అమ్మవారికి అత్యంత వైభవంగా బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోక్ ఇండస్ట్రీలో స్థిరపడినటువంటి కళాకారులు తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతికగా నిలిచే బోనాలను డబ్బు చప్పులతో తీన్మార్ స్టెప్పులతో అమ్మవారికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. బోనాల సందర్భంగా యూట్యూబ్ కళాకారిణి, కళాకారుల రాకతో పట్టణంలో పండగ వాతావరణం సంతరించుకుంది. దింతో యూట్యూబ్ కళాకారులను చూసేందుకు పట్టణ ప్రజలు, యువత ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమంలో యూట్యూబ్ కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ క్రికెటర్ గొంగడి త్రిషకు రూ.కోటి నజరానా



**● ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇటీవల జరిగిన మహిళల అండర్ 19 టీ20 వరల్డ్ కప్‌లో భారత అమ్మాయిలు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఫైనల్ లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించి వరుసగా రెండో సారి ఛాంపియన్ గా నిలిచారు. ఈ కప్ సాధించడంలో తెలంగాణ క్రికెటర్ గొంగడి త్రిష కీలక పాత్ర పోషించింది. టోర్నీ ఆద్యాంతం ఆల్ రౌండ్ షో చేసి ఆకట్టుకుంది. తుది పోరులో 33 బంతుల్లో 44 పరుగులతో నాటౌట్ గా నిలిచింది. బౌలింగ్ లోనూ 3 వికెట్లు తీసింది. మొత్తంగా ఈ టోర్నీలో 77.25 సగటుతో 309 పరుగులు చేసింది. ఇందులో ఓ అజేయ శతకం కూడా ఉంది. బౌలింగ్‌లో 7 వికెట్లు తీసి ఆకట్టుకుంది.

ఇదిలా ఉండగా తాజాగా ఆమె తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా త్రిష ను సీఎం సత్కరించి అభినందించారు. అలానే ఆమెకు రూ. కోటి రూపాయల నజరానా ప్రకటించారు. భవిష్యత్ లో దేశం తరుపున మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ అండర్ 19 వరల్డ్ కప్ టీమ్ మెంబర్స్ అయిన, తెలంగాణ కు చెందిన ధృతి కేసరికి రూ.10 లక్షలు, హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.10 లక్షల చొప్పున నజరానా ను ప్రకటించారు.

# నెంబర్ 2కు అభిషేక్ శర్మ



**బలగం టీవీ, హైదరాబాద్**

అభిషేక్ శర్మ..ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ అద్భుతంగా రాణించిన సంగతి తెలిసిందే. దాంతో అభిషేక్ శర్మ తాజాగా విడుదలైన ఐసీసీ ర్యాంకుల్లోనూ ఏకంగా 38 స్థానాలు ఎగబాకి రెండో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. తాజాగా జరిగిన ఐదో టీ20లో సంచలన ఇన్నింగ్స్‌తో విధ్వంసం సృష్టించి 37 బంతుల్లోనే శతకం బాదిన ఈ యంగ్ ప్లేయర్ 829 పాయింట్లతో ఈ ర్యాంక్‌కు చేరుకున్నాడు.టాప్ పొజిషన్‌లో మాత్రం 855 పాయింట్లతో ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ కొనసాగుతున్నాడు. ఇక అభిషేక్ తర్వాతి స్థానాల్లో తిలక్ వర్మ (803 పాయింట్లు), ఫిల్ సాల్ట్ (798), సూర్యకుమార్ యాదవ్ (738) ఉన్నారు.

ఇదిలా ఉండగా, తాజాగా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా' నిలిచిన బౌలర్ వరుణ్ చక్రవర్తి కూడా ఐసీసీ ర్యాంకుల్లో టాప్ పొజిషన్‌కు చేరుకున్నాడు. మూడు స్థానాలను మెరుగుపరుచుకుని మూడో ర్యాంక్‌ను సాధించాడు. అయితే ఈ లిస్ట్‌లో వెస్టిండీస్ బౌలర్ అకీల్ హుసేన్ (707 పాయింట్లు) అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక అదిల్ రషీద్ (705), వరుణ్ చక్రవర్తి (705) పాయింట్ల పరంగా ఒకే పొజిషన్‌లో ఉన్నప్పటికీ, కొద్దిపాటి తేడాతో రషీద్ రెండు స్థానంలో నిలిచాడు. ఇక 671 పాయింట్లను సాధించిన రవి బిష్ణోయ్ ఈ ర్యాంకింగ్స్‌లో నాలుగు ర్యాంకులను ఎగబాకి ఆరో ప్లేస్‌కు చేరుకున్నాడు.

మరోవైపు టెస్టుల్లో బౌలింగ్ విభాగంలో భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా (908) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. రవీంద్ర జడేజా 745 పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక బ్యాటర్ల విషయానికొస్తే, ఇంగ్లాండ్ స్టార్ క్రికెటర్ జో రూట్ 895 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే ఈ సారి టాప్ -10లో కేవలం ఇద్దరు టీమ్‌ఇండియా బ్యాటర్లు మాత్రమే ఉండటం గమనార్హం. యశస్వి జైస్వాల్ 847 పాయింట్లతో నాలుగో ప్లేస్‌ను సాధించగా, 739 పాయింట్లతో రిషభ్ పంత్ తొమ్మిదో స్థానంలో నిలిచాడు.



## నిజమైన ప్రేమ బాధను మాత్రమే మిగులుస్తుంది

**● నాగచైతన్య**

**బలగం టీవీ, హైదరాబాద్**

సినీ నటుడు నాగచైతన్య నటించిన తండేల్ ఫిబ్రవరి 7వ తేదీ విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వరుసగా ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొంటూ ఎంతో బిజీగా గడుపుతున్న నాగచైతన్య ఓ ఇంటర్వ్యూలో భాగంగా ప్రేమ గురించి మాట్లాడారు. ఒక నిజమైన ప్రేమలో చాలా బాధ ఉంటుంది.మీరు ఆ బాధను అనుభవించిన తర్వాత దాని నుండి బయటపడినప్పుడు, అది సంబంధాన్ని చాలా భిన్నమైన రీతిలో బంధిస్తుంది.అలాంటి ఒక ప్రయాణాన్ని మీరు ఈ సినిమాలో చూస్తారు .కచ్చితంగా ఈ సినిమా మీకు నచ్చుతుంది అని అన్నారు.

నాగచైతన్య మొదట సమంతను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఇక నాగచైతన్య ఇటీవల నటి శోభితనురెండవ వివాహం చేసుకున్న సంగతి మనకు తెలిసిందే. ఇక వీరిద్దరి వివాహం తర్వాత మొదటి సారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నటువంటి చిత్రం తండేల్.ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలను కూడా ఏర్పడ్డాయి.



## రూ.100 కోట్ల నష్టం వచ్చింది

**● నిర్మాత రమేశ్‌బాబు**

**బలగం టీవీ, హైదరాబాద్**

కష్టకాలంలో తనను ఏ ఒక్క హీరో పట్టించుకోలేదని టాలీవుడ్ నిర్మాత రమేశ్ బాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. 2011లో గచ్చిబౌలిలో హైదరాబాద్ వ్యాపారవేత్తను బెదిరించి 12 కోట్లు స్వాహా చేసినట్లు రమేశ్ బాబుపై కేసు నమోదైన విషయం తెలిసిందే. రమేశ్ బాబు ఈ కేసులో 78 రోజులు జైల్లో ఉన్నారు. అయితే ఈ కేసులో ఎలాంటి సాక్షాధారాలు లేకపోవడంతో 2025 జనవరి 31న రమేశ్ బాబును కోర్టు నిర్దోషిగా తేల్చింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రెస్ మీట్‌లో రమేశ్ బాబు చేసిన కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.

"నా మీద అబద్దపు కేసులు వేశారు. 14 ఏండ్ల పాటు న్యాయపోరాటం చేసి.. ఇప్పుడు విజయం సాధించాను. అబద్దపు కేసులు ఎప్పుడూ నిలబడవు. నన్ను ఈ స్థితికి తీసుకొచ్చిన వాళ్ల మీద న్యాయపోరాటం చేస్తాను. నేను కష్టకాలంలో ఉన్నప్పుడు ఇండస్ట్రీ నుంచి ఏ ఒక్క హీరో నుంచి ఫోన్ చేయలేదు.. కనీసం పలుకరించలేదు" అని రమేశ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. "ఈరోజుల్లో శంకర్, రాజమౌళి సినిమాలప్రొడక్షన్ కోసం మూడు నాలుగేళ్ల సమయం పడుతుంటుంది. రీసెంట్ గా 'పుష్ప 2' మూవీని మూడేళ్లు చేసారు. కానీ నేను నిర్మాణంలో ఉన్న రోజుల్లో మూడేళ్ళ సినిమా అనేదే లేదు. ఆరు నెలల నుంచి ఒక ఏడాది లోపు పూర్తయ్యేవి. నా ఫేట్, బ్యాడ్ లక్ ఏంటంటే.. 'కొమురం పులి', 'ఖలేజా' సినిమాలకు మూడు సంవత్సరాల టైం పట్టింది. మూడేళ్లకు మెయింటనెన్స్ ఎంత ఉంటుందనేది ఒక ప్రొడ్యూసర్ కే తెలుస్తుంది. నాకు రెండు సినిమాల్లో 100 కోట్ల నష్టం వచ్చింది" అని అన్నారు. తమిళంలో 'విలన్' 'పోకిరి' సినిమాలు నిర్మించిన శింగనమల రమేష్ బాబు.. కనకరత్న మూవీస్ బ్యానర్ లో తెలుగులో 'కొమురం పులి', 'ఖలేజా' సినిమాలు నిర్మించారు. ఆరోజుల్లోనే ఇవి రెండూ అత్యంత భారీ బడ్జెట్ ఖర్చు చేసి తీసిన చిత్రాలు. అయితే సినిమా ఫెయిల్ అవ్వడంతో నిర్మాతకు నష్టాలు వచ్చాయి.



## చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్

**బలగం టీవీ, హైదరాబాద్**

టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ చరిత్ర సృష్టించాడు. సౌతాఫ్రికా వేదికగా జరుగుతోన్న సౌతాఫ్రికా 20 లీగ్‌లో ఈ రికార్డును సాధించాడు. ఎంఐ కేప్‌టౌన్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న రషీద్, పార్ల్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టీ20ల్లో (అంతర్జాతీయ + లీగ్‌లు) కలిపి 633 వికెట్లను పడగొట్టాడు. ఇందులో అఫ్గాన్ తరపున మాత్రమే 161 వికెట్లు తీశాడు. మిగిలిన 472 వికెట్లు డొమస్టిక్ క్రికెట్‌తో పాటు వివిధ లీగుల్లో తీశాడు. ఇదిలా ఉండగా, 461 మ్యాచుల్లో 18.08 సగటుతోనే అత్యధిక వికెట్లను పడగొట్టి రషీద్ ఈ రికార్డును సాధించాడు. అయితే వెస్టిండీస్ మాజీ స్టార్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో 582 మ్యాచుల్లో 24.40 సగటుతో 631 వికెట్లు పడగొట్టాడు.

## నటి పుష్పలత కన్నుమూత

**బలగం టీవీ, హైదరాబాద్**



అలనాటి నటి పుష్పలత కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. 87 ఏళ్ల పుష్పలత మంగళవారం రాత్రి చెన్నైలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్ సమీపంలోని మెట్టుపాళ్యంకు చెందిన ఆమె.. 1955లో ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కిన 'చెరపకురా చెడేవు' చిత్రం ద్వారా తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం అయ్యారు. భాషతో సంబంధం లేకుండా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 100కు పైగా సినిమాల్లో ఆమె నటించారు. ప్రముఖ నటులు ఎంజీఆర్, శివాజీ గణేషన్, జెమినీ గణేషన్, జైశంకర్ ల సినిమాల్లో నటించారు. తెలుగులో ఎన్నో చిత్రాలలో ఆమె నటించి ప్రేక్షకులను అలరించారు. 1963లో ఏవీఎం రాజన్ సినిమా 'నానుమ్ ఒరు పెన్' చిత్రంలో ఆమె నటించారు. ఆ సందర్భంగా ప్రేమలో పడిన వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఒక కూతురు హీరోయిన్ గా రాణించింది.




**హీరో సిద్ధార్థ్ తాజా చిత్రాన్ని శ్రీ గణేష్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు టైటిల్ టీజర్‌ను తాజాగా రిలీజ్ చేశారు మేకర్స్.ఈ చిత్రానికి '3బీహెచ్‌కే' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను మేకర్స్ ఫిక్స్ చేశారు. ప్రతి మధ్యతరగతి కుటుంబంలో జరిగే విషయాలు మనకు ఈ సినిమాలో కథగా చూపించబోతున్నట్లు ఈ టైటిల్ టీజర్ చూస్తే అర్థవ‌ఎవుతుంది. సాధారణ గుమాస్తా అయిన ఓ తండ్రి, ఇంట్లో అందరి పనులు చూసుకునే తల్లి.. వారికి ఓ కొడుకు, కూతురు.. వారి కల.. అనే నేపథ్యంలో ఈ సినిమా రానున్నట్లు ఈ టైటిల్ టీజర్ చెబుతోంది. అమ్రిత్ రామ్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. అరుణ్ విశ్వ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.**



**టాలీవుడ్ నటి సంయుక్త మీనన్ త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించింది. పుణ్య స్నానం ఆచరించిన ఫొటోను సోషల్ మీడియాలో సంయుక్త మీనన్ పంచుకుంది. జీవితానికి మించిన విశాలతను మనం చూసినప్పుడు... జీవితం తన అర్థమేమిటో వెల్లడిస్తుందని సంయుక్త పోస్ట్ చేసింది. కుంభమేళాలో పవిత్ర గంగా నదిలో స్నానం చేస్తున్నప్పుడు తన మనసు మరింత తేలికపడిందని తెలిపింది. సినిమాల విషయానికి వస్తే... తొలిసారి హీరోయిన్ సెంట్రిక్ మూవీలో సంయుక్త నటిస్తోంది.**